నవతెలంగాణ
ఆదిలాబాద్
మంగళవారం | జులై 30, 2024 | www.navatelangana.com

రేపు హైదరాబాద్‌లో కార్మికుల ధర్నా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 31న హైదరాబాద్‌లో ధర్నా నిర్వహిస్తున్నామని మధ్యాహ్న భోజన కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు కుంటాల రాములు అన్నారు. సోమవారం పట్టణంలోని రాంనగర్ కాలనీలో కార్మికులతో సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లో జరిగే సభకు జిల్లా నుంచి అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని కోరారు. అధికారంలోకి రాకముందు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి రోజు పిల్లలకు వేడివేడిగా భోజనం పెట్టే కార్మికులను వదిలి ఒక రాత్రికి సెంట్రలైజ్ కిచెన్ ఏర్పాటు చేయడం సరికాదన్నారు. దీన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు తోపునూరు చక్రపాణి, కార్మికులు రాంబాయి, శశికళ, పుష్ప, బుచ్చయ్య, సత్తెమ్మ పాల్గొన్నారు.

మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో పోలీసుల తనిఖీలు

నవతెలంగాణ -వేమనపల్లి

మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో నీల్వాయి ఎస్సై శ్యామ్ పటేల్ తన సిబ్బందితో పాటు టిఎస్ఎస్పీ సిబ్బందితో కలిసి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మంగనపల్లి ఎక్స్ రోడ్డు వద్ద సోమవారం వాహనాల తనిఖీ చేపట్టారు. వ్యక్తుల వివరాలు తెలుసుకుంటూ వారి వెంట ఉన్న వస్తువులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నీల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆకస్మిక తనిఖీలు, ఆర్‌ఓపి, ఏరియా డామినేషన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. తమ నివాస ప్రాంతాల్లో ఎవరైన కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించినట్లయితే స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.



సింగరేణిని రక్షిద్దాం..భావితరాలకు అందిద్దాం..!

- ప్రయివేటుకు అప్పగిస్తే ప్రజల మనుగడకే ప్రమాదం
- సంఘటితమై ఉద్యమిద్దాం..వేలాన్ని అడ్డుకుందాం
- ఎర్రజెండా ఎల్లవేళలా అండగా ఉంటుంది
- బెల్లంపల్లిలో ప్రారంభమైన సింగరేణి పరిరక్షణ బస్సు యాత్ర
- ఘన స్వాగతం పలికిన కార్మికులు, పార్టీ శ్రేణులు
- నేడు శ్రీరాంపూర్‌లో పర్యటించనున్న యాత్ర

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, మంచిర్యాల

తెలంగాణ మణిమకుటంగా వెలుగొందుతున్న సింగరేణిని రక్షించుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.. భావితరాల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన అవసరం ఉంది. ఈ సంస్థ ప్రయివేటు చేతిలో పెడితే సంస్థ మనుగడతో పాటు ప్రజల జీవనానికే ప్రమాదం ఏర్పడుతుందని వక్తలు పేర్కొన్నారు. సింగరేణి ప్రయివేటీకరణను వ్యతిరేకించడంతో పాటు శ్రావణపల్లి బొగ్గు బ్లాకు వేలాన్ని నిలుపుదల చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఐ(ఎం) సింగరేణి పరిరక్షణ బస్సు యాత్రను చేపట్టింది. రాష్ట్రంలోని కోల్‌బెల్ట్ ఏరియాలో వారం రోజుల పాటు పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, పైళ్ల ఆశయ్య యాత్ర చేపడుతున్నారు. ఈ యాత్ర సోమవారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో మొదలు కాగా.. పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ముఖ్య అతిథిగా జెండా ఊపి ప్రారంభించారు. మంగళవారం సైతం మంచిర్యాల జిల్లాలో ఈ యాత్ర కొనసాగనుంది.



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య

ప్రయివేటీకరిస్తే మనుగడే ప్రమాదం..!

లక్షలాది మందికి ప్రత్యక్షంగా..పరోక్షంగా బతుకునిస్తున్న సింగరేణి సంస్థ ప్రయివేటు చేతిల్లోకి వెళ్తే దాని మనుగడకే ప్రమాదం ఏర్పడుతుందని సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బీఆర్ఎస్ హయాంలో రెండు బొగ్గు బ్లాకులను ప్రయివేటుకు అప్పగించగా.. తాజాగా కాంగ్రెస్ హయాంలో శ్రావణపల్లి బొగ్గుబ్లాకుకు వేలం పాట వేయడాన్ని కార్మికక్షేత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయాన్ని సీపీఐ(ఎం) తీవ్రంగా తప్పుబడుతోంది. కార్మికవర్గంతో పాటు ప్రజల్లోనూ ప్రభుత్వాల చర్యలపై చైతన్యం తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. అన్ని వర్గాల ప్రజలతో కలిసి ఉద్యమించాలని భావిస్తోంది.

బల్బు వెలగాలంటే బొగ్గు బావి ఉండాలి

గుడిసెలో బల్బు వెలగాలంటే బొగ్గు బావి తప్పనిసరిగా ఉండాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. సింగరేణి పరిరక్షణ బస్సు యాత్రకు నాయకత్వం వహిస్తున్న వీరయ్య యాత్ర ప్రారంభ సందర్భంగా మాట్లాడారు. సింగరేణిని రక్షించుకోవడం అందరి బాధ్యత అని గుర్తు చేశారు. సింగరేణి యాజమాన్యం బొగ్గు వెలికి తీయడమే కాకుండా కరెంటును కూడా ఉత్పత్తి చేస్తోందని చెప్పారు. సింగరేణి యూనిట్‌కు రూ.4కు అందిస్తే, ప్రయివేటు చేతుల్లోకి వెళ్తే యూనిట్ విద్యుత్‌కు రూ.18వసూలు చేస్తుందని తెలిపారు. సింగరేణి ప్రయివేటు చేతుల్లోకి వెళ్తే పేదల గుడిసెల్లో బల్బు ఎలా వెలుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో మోడీ వచ్చిన తర్వాత కోల్‌ఇండియా, సింగరేణిలోనూ ప్రయివేటు వాళ్లకు హక్కులు కల్పిస్తూ చట్టం తీసుకొచ్చారని గుర్తు చేశారు. విదేశీయులు కూడా బొగ్గును తవ్వుకోవచ్చనే చట్టాలు చేస్తే వీటిని కాంగ్రెస్ కూడా సమర్థించిందని తెలిపారు. వేలం పాట పెడితే కోల్‌ఇండియా, సింగరేణి సంస్థలు ప్రయివేటుతో పోటీపడి దక్కించుకోవాలని చెబుతున్నాయని పేర్కొన్నారు. సింగరేణి వెలికి తీసిన బొగ్గు రూ.4వేలకు టన్ను చొప్పున ఇస్తే అదానీ కంపెనీ రూ.18వేలకు టన్ను చొప్పున విక్రయిస్తున్నారని తెలిపారు. బీజేపీకి ఎనిమిది ఎంపీ సీట్లు ఇస్తే ఆ పార్టీకి చెందిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి హైదరాబాద్‌లో కూర్చొని వేలం పెట్టారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతకు ముందు పార్టీ శ్రేణులు, కార్మికులు పెద్ద ఎత్తున తరలొచ్చి సింగరేణి పరిరక్షణ బస్సు యాత్రకు ఘన స్వాగతం పలికారు. బస్సు యాత్ర ప్రారంభ కార్యక్రమంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి మంద నరసింహారావు, సీపీఐ(ఎం), ప్రజా సంఘాల నాయకులు దాసరి రాజేశ్వరి, గోమాస ప్రకాష్, ఎర్రం పున్నం, కనికరపు అశోక్, అబ్బోజు రమణ, దాగం శ్రీకాంత్, దుంపల రంజిత్‌కుమార్, బోడెంకి చందు, దూలం శ్రీనివాస్, అల్లి రాజేందర్, గుల్ల బాలాజీ పాల్గొన్నారు.

సింగరేణిని అమ్ముతుంటే ఊరుకుంటామా : పైళ్ల ఆశయ్య, రాష్ట్ర కమిటీ సభ్యుడు

మన వేలితో మన కన్నునే పొడుచుకునేలా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రయత్నాలు చేస్తోంది. ఇది వరకు కేంద్రం చేసిన రైతు చట్టాలకు వ్యతిరేకంగా ఉధృత పోరాటం జరగడంతో వెనక్కి తగ్గింది. ఆంధ్రాలో ఉక్కు పరిశ్రమ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం జరిగితే అక్కడా కేంద్రం వెనక్కి తగ్గింది. ఇక్కడ సింగరేణిని ప్రయివేటీకరిస్తామంటే ఊరుకుంటామా..? బొగ్గు బ్లాకుల వేలాన్ని ప్రభుత్వం విరమించుకోవాలి.

ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం : సంకె రవి, సీపీఐ(ఎం) మంచిర్యాల జిల్లా కార్యదర్శి

సింగరేణి ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం. జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాకును వేలం వేయడాన్ని విరమించుకోవాలి. ఇందుకు జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ప్రస్తావించి సీఎంతో మాట్లాడాలి. బొగ్గు బ్లాకు వేలాన్ని నిలిపివేయకపోతే గత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు పట్టిన గతే కాంగ్రెస్ ఎమ్మెల్యేలకు పడుతుంది.



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యుడు ఆశయ్య



మాట్లాడుతున్న సీపీఐ(ఎం) మంచిర్యాల కార్యదర్శి సంకె రవి



హాజరైన పార్టీ నాయకులు, కార్యకర్తలు, సింగరేణి కార్మికులు

మార్కెట్ కమిటీ చైర్మన్ పదవీ బీసీలకు దక్కేనా..?

- అగ్రవర్ణాలకు కట్టబెట్టేందుకు నాయకుల యత్నాలు

నవతెలంగాణ-భైంసా

భైంసా మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవి ఎవరికి దక్కుతుందోనన్న చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా కొనసాగుతోంది. దశాబ్దాల కాలం పాటు కాంగ్రెస్‌లో సైనికుడిలా పనిచేస్తూ, కష్టకాలంలో కాంగ్రెస్‌కు బాసటగా నిలిచిన ఆనందరావు పటేల్‌కు మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవి రాకుండా కుటిల యత్నాలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనంద్‌రావు పటేల్‌ను పక్కకు తప్పించి ప్రముఖ నాయకులు వారి కుటుంబ సభ్యులకు మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవి ఇప్పించే ఆలోచనలో ఉన్నట్టు తెలుస్తోంది. అనంద్‌రావు పటేల్‌కు మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవి ఇప్పిస్తే అతను బలపడి తమ ఆధిపత్యం తగ్గుతుందన్న ఆలోచనలో ఇక్కడి ప్రముఖ నాయకులు ఉన్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. చైర్మెన్ పదవి ఖరారయ్యాక జీఓ విడుదల కావడం లేదంటే, ఇక్కడి నాయకుల కుటిల యత్నాల వల్లేనని ఆనంద్‌రావు పటేల్ అభిమానులు వాపోతున్నారు. ఒకవేళ బీసీలకు మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవి ఇవ్వకపోతే నియోజకవర్గంలో బీసీల తడాఖా ఏంటో చూపిస్తామని పలువురు బీసీ నాయకులు తెలియజేస్తున్నారు. రాష్ట్రంలో పలుచోట్ల మార్కెట్ కమిటీ చైర్మెన్ నియామకాలు అయినప్పటికీ ఇక్కడ చైర్మెన్ పదవి కట్టబెట్టకుండా అడ్డుకోవడంలో ఆంతర్యం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు. రాష్ట్రంలోనే భైంసా మార్కెట్ కమిటీ మంచి స్థానంలో ఉంది. మార్కెట్ కమిటీ పాలకవర్గాన్ని త్వరలో నియమిస్తే రైతాంగానికి మేలు జరగనుంది.

సీఅండ్ఎండీ పుట్టినరోజు సందర్భంగా మొక్కలు నాటిన జిఎం



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాం జన్మదినం సందర్భంగా సోమవారం శ్రీరాంపూర్ ఏరియాలోని సిహెచ్‌పి ఆవరణలో శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్ బలరాం సింగరేణి వ్యాప్తంగా అన్ని ఏరియాలలో సుమారు 18000 మొక్కలను నాటారని, వారిని ఆదర్శంగా తీసుకొని సింగరేణి ఉద్యోగులు, అధికారులు వారి వారి ఇండ్లు, కార్యాలయాల్లో మొక్కలు నాటడం అభినందించదగిందని పేర్కొన్నారు. నాటిన మొక్కలను ప్రతి ఒక్కరు కాపాడాలని, పర్యావరణ పరిరక్షణలో తమవంతు బాధ్యతగా ఉండాలని సూచించారు. సిహెచ్‌పిని పచ్చదనంగా మార్చాలని ఉద్యోగులను కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీసైదా, ఏజీఎం(ఈఅండ్ఎం) బి చంద్రశేఖర్‌రెడ్డి, ఆర్కే5,6 గ్రూప్ ఏజెంట్ ఏవి రెడ్డి, డిజీఎం(సివిల్)ఆనంద్ కుమార్, ఆర్కే5 ఇన్‌ఛార్జి మేనేజర్ శివయ్య, ఇన్‌చార్జి డిజీఎం(ఈఅండ్ఎం), సిహెచ్‌పి ఎస్ఆర్పి చంద్రలింగం, ఏఐటియుసి పిట్ సెక్రటరి సల్ల తిరుపతి పాల్గొన్నారు.

గుండెపోటుపై అవగాహన

నవతెలంగాణ-బోథ్



మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సీపీఆర్‌పై అంతర్జాతీయ మానవ హక్కుల సంఘం కమిషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్ బాసెట్టి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్డియో, పల్మానరి, రిసిస్టేషన్ గుండెపోటు వచ్చినప్పుడు ఈ సీపీఆర్ విధానం ద్వారా ఎలాంటి మందులు ఇంజక్షన్లు అవసరం లేకుండా అంబులెన్స్ వచ్చేంత వరకు మనిషిని కాపాడవచ్చని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాలలో విద్యార్థులకు సీపీఆర్ విధానం నేర్పుతున్నారని, మన దేశంలో వీటిపై అవగాహన లేకనే చాలా మరణాలు జరుగుతున్నాయని అన్నారు. పిడుగు పాటు రక్షణ, నవ సమాజా నిర్మాణానికి ఉపాధ్యాయుడు పాత్ర, స్వామి వివేకానంద యువతకు ఇచ్చిన సందేశం విద్యార్థుల అభ్యున్నతికి ఉపయోగపడే వీడియోలను ప్రొజెక్టర్ ద్వారా చూపించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రవికుమార్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్ మాధవి, విద్యార్థినులు పాల్గొన్నారు.

హవర్గాలో ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

నవతెలంగాణ-లోకేశ్వరం



మండలంలోని హవర్గ గ్రామానికి చెందిన పర్స భోజన్నకు అదే గ్రామానికి చెందిన లక్ష్మణ్‌కు రెండేళ్లుగా భూతగాదాలు ఉండగా జూన్ 24న వ్యవసాయ పనుల నిమిత్తం భోజన్న చేనుకు వెళ్లగా అప్పటికే లక్ష్మణ్, అతని భార్య గోదావరి అక్కడ ఉన్నారు. ఇరువురి మధ్య వాగ్వాదం జరగగా లక్ష్మణ్ చేతిలో ఉన్న పారతో భోజన్న తలపై కొట్టడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు నిర్మల్ ప్రభుత్వాస్పతికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. అప్పటి భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, ముధోల్ సీఐ మల్లేశ్, అప్పటి లోకేశ్వరం ఎస్సై మోహన్‌రావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు లక్ష్మణ్, గోదావరిపై కేసు నమోదు చేశారు. ఈ కేసు విషయమై భైంసా పట్టణానికి ఇటీవల కొత్తగా వచ్చిన ఏఎస్పీ అవినాష్ కుమార్ సోమవారం గ్రామంలో ఇరువర్గాలతో ఎస్సీ, ఎస్టీ కేసు విచారణ చేపట్టారు. అనంతరం మాదక ద్రవ్యాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడటం వల్ల తమ జీవితాలు నాశనం కావడంతో పాటు కుటుంబాలు రోడ్డున పడుతున్నాయన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సక్రియ నాయక్, ఏఎస్సై దిగంబర్, సిబ్బంది పాల్గొన్నారు.

నిర్ధారణ పేరిట రుణమాఫీకి జాప్యం

- అకౌంట్‌లో డబ్బులు పడక ఆందోళనలో అన్నదాత
- సర్వే తప్పిదాలు రైతులకు శాపాలు

నవతెలంగాణ-భైంసా



లక్ష రూపాయల లోపు రైతులకు రుణమాఫీ జరిగినప్పటికీ కొందరికి రుణమాఫీ డబ్బులు అందక ఆందోళనకు గురవుతున్నారు. ప్రభుత్వం ఆధార్, రేషన్‌కార్డును అనుసంధానంగా తీసుకోవడంతో బ్యాంకు అకౌంట్‌లో పేరు తప్పిదంతో నిర్ధారణ జరగలేదంటూ వారి డబ్బులు ఖాతాల్లో జమకు నోచుకోలేదు. దీంతో తమకు రుణమాఫీ వస్తుందా? లేదా అని రైతులు ఆధార్ కార్డు పట్టుకొని వ్యవసాయ అధికారుల వద్దకు వెళ్తున్నారు. ఇలా వందలో 25 శాతం మంది రైతులకు కుటుంబ సభ్యుల నిర్ధారణ జరగలేదని, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ రైతు పేరులో తేడా ఉందని రికార్డుల్లో ఉంది. దీంతో కొంతమంది రైతులు తమకు రుణమాఫీ వస్తుందా లేదా అని ఆందోళనకు గురవుతున్నారు. ఖరీఫ్ ప్రారంభం కావడం, రైతులంతా కష్టకాలంలో ఉన్న సమయంలో ప్రభుత్వం రుణమాఫీ చేస్తున్నప్పటికీ కొన్ని తప్పిదాల వల్ల కొందరు రైతులు రుణమాఫీకి నోచుకోవడం లేదు. ఏడు సంవత్సరాల నుండి ఇప్పటి వరకు కొత్త రేషన్ కార్డుల ప్రక్రియ ప్రారంభించలేదు. ఆన్‌లైన్‌లో తప్పిదం మూలంగా రేషన్ కార్డులో కుటుంబ యజమాని పేరు మిస్ కావడంతో రుణమాఫీకి సంబంధించిన వ్యవసాయ శాఖ రికార్డుల్లో కుటుంబ సభ్యుల నిర్ధారణ జరగకపోవడంతో రుణమాఫీకి అర్హులమవుతామా? లేదా? అన్న ఆందోళన రైతులకు మొదలైంది. గ్రామాల్లో పెద్ద మొత్తంలో రైతుల రుణమాఫీ వివరాలు ఇదేవిధంగా ఉండటంతో టెన్షన్ మొదలైంది. విచారణ చేపడతామని వ్యవసాయ అధికారులు తెలియజేసినప్పటికీ, ప్రభుత్వం పూర్తి స్థాయిలో రుణమాఫీ డబ్బులు వేస్తుండడంతో ఇలా రైతుల పేర్లు మిస్ కావడంతో పూర్తిస్థాయిలో రుణమాఫీ అందడం లేదని రైతులు వాపోతున్నారు. వ్యవసాయ అధికారులు తక్షణం సర్వే చేపట్టి వెనువెంటనే ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చి రుణమాఫీ చేయిస్తే రైతుకు కొంత న్యాయం జరుగుతుంది. నిర్ధారణ పేరిట ప్రభుత్వం కొందరు రుణాలను ఆపేసి జాప్యం చేస్తుందని రైతులు వాపోతున్నారు. నిర్ధారణ పేరిట రుణమాఫీ జాప్యం చేయవద్దని, సమస్యను తక్షణం పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

మల్కెపల్లిలో బెల్టు షాపుల జోరు

- 24 గంటల మద్యం అమ్మకాలతో ఇబ్బందులు

నవతెలంగాణ - కాసిపేట

మండలంలోని మల్కెపల్లి గ్రామంలో బెల్ట్ షాపుల్లో విచ్చలవిడిగా 24 గంటల మద్యం అమ్మకాలతో గ్రామస్తులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. మల్కెపల్లి గ్రామ నడిబొడ్డులో బెల్ట్ షాపులు ఉండగా సమయ పాలన లేకుండా రాత్రిళ్లు సైతం మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. తాగడానికి వచ్చే వారు బెల్ట్ షాపుల ముందే నడి రోడ్లపై తాగుతూ నానా హంగామా చేస్తున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం బెల్ట్ షాపులో అధికంగా తాగిన యువకులు తమకు గిట్టని యువకులను పిలిచి దాడి చేసిన సంఘటన భయాందోళనకు దారి తీసింది. తాగిన మైకంలో ఉన్న యువకులు వారి వ్యక్తి గత గొడవలతో పలువురు యువకులను పిలిచి బహిరంగంగా దాడులు చేయడం అక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. అర్ధ రాత్రి వరకు బెల్ట్ షాపుల్లో మద్యం అమ్మకాలు చేయడంతో రాత్రిళ్లు తాగి గ్రామంలో ఇబ్బందులకు గురి చేస్తునట్లు పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. తాగిన మైకంలో ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని, బయటకు చెప్తే ఏమంటారో నని భయంతో ఆవేదన చెందుతున్నారు. బెల్ట్ షాపుల్లో తాగి గ్రామంలో రోడ్లపై తిరుగుతూ గొడవలు చేయడం సర్వ సాధారణమని పలువురు తెలిపారు. ఇదేంటని పలువురు గ్రామస్తులు ప్రశ్నిస్తే బెల్ట్ షాపు నిర్వాహకులు ఎక్కడైనా చెప్పుకోండి అని తెగించి చెబుతున్నారని వాపోతున్నారు. సంబంధిత అధికారులకు అన్ని చూసుకుంటామని తెగేసి చెబుతున్నారు. విషయాన్ని బయటకు చెప్తే తన పేరు తెలిస్తే తాగి గొడవ చేస్తారని గ్రామస్తులు భయపడుతున్నారు. మద్యంతో పాటు గుట్కా వ్యాపారం కూడా మల్కెపల్లి కేంద్రంగా మండలం మొత్తం దందా సాగుతోందని సమాచారం. ఇక్కడి నుంచే ప్రతి గ్రామానికి సరఫరా అవుతోందని పలువురు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు బెల్ట్ షాపులను నియంత్రించాలని, గుట్కా వ్యాపారం అరికట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డు సమస్య పరిష్కరించాలి

నవతెలంగాణ-నార్నూర్



వర్షాకాలంలో మారుగూడ రోడ్డు బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని పెసా చట్టం వైస్ ప్రెసిడెంట్ సురేష్ రాథోడ్ ఆరోపించారు. సోమవారం మండలంలోని గుండాల గ్రామపంచాయతీ పరిధిలోని మారుగూడ సమత్‌నగర్ రోడ్డును పరిశీలించారు. రోడ్డు సరిగా లేకపోవడంతో గ్రామస్తులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారని తెలిపారు. నేటికీ గ్రామీణులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు.

బద్ది పోచ్చమ్మ ఆలయంలో అన్నదానం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని కోలిపుర కాలనీలో ప్రసిద్ధిగాంచిన వేములవాడ శ్రీబద్దీపోచ్చమ్మ ఆలయంలో అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఆషాడం మాసం సందర్భంగా బోనాల పండుగను పురస్కరించుకుని ఆదివారం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పించారు. సోమవారం ఆలయం ప్రత్యేక హారతులతో పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయంలో అన్నదాన ప్రసాద వితరణ కార్యక్రమం చేపట్టారు. పాడి పంటలు సమద్ధిగా కురిసి అందరూ సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని మనస్ఫూర్తిగా ప్రార్థించారు. అమ్మ దయ అందరిపై ఉండాలని వేడుకున్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
2
మంగళవారం | జులై 30, 2024 | www.navatelangana.com

ఆశ్రమ పాఠశాలను సందర్శించిన సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ-కుభీర్



మండలంలోని డోడర్నా తండా1లో గల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సోమవారం సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు దుర్గం నూతన్ కుమార్ పార్టీ సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులతో మాట్లాడి విద్యార్థుల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలో విద్యార్థులకు సరిపోయే తరగతి గదులను వెంటనే నిర్మించాలని డిమాండ్ చేశారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు విద్యార్థులకు సరిపడే గదులను అదనంగా నిర్మించాలన్నారు. విద్యార్థులు రాత్రి సమయంలో పడుకోవడానికి సరైన రూమ్స్ లేక ఇబ్బంది పడుతున్నారని అన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా విద్యార్థుల మెస్ ఛార్జీలను పెంచాలని డిమాండ్ చేశారు. ఆశ్రమ పాఠశాలను సందర్శించిన వారిలో జిల్లా కమిటీ సభ్యులు డాకూర్ తిరుపతి, కుభీర్ మండల కార్యదర్శి జాదవ్ రమేష్ పాల్గొన్నారు.

అడవులు, పులుల సంరక్షణకు అందరూ కృషి చేయాలి

నవతెలంగాణ-కడెం



అడవులు, పులుల సంరక్షణకు అందరూ కృషి చేయాలని కడెం ఎఫ్ఆర్ఓ అనిత సూచించారు. సోమవారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో ఫారెస్ట్ సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడారు. పులులను సంరక్షిస్తేనే అడవులు బాగుండి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు, ఎఫ్బీఓలు సిబ్బంది పాల్గొన్నారు.

జన చిత్ర అసెంబ్లీ కన్వీనర్‌గా అష్ట దిగంబర్

నవతెలంగాణ-ముధోల్

జన చిత్ర పరివార్ టాలెంట్ బ్యాంక్ కమిటీ ముధోల్ నియోజకవర్గ కన్వీనర్‌గా మండలంలోని అష్ట గ్రామానికి చెందిన ప్రముఖ గాయకుడు, రచయిత అష్ట దిగంబర్‌ను ఎంపిక చేసినట్టు నిర్మల్ జిల్లా కోకన్వీనర్ జున్ను అనిల్, టౌన్ కన్వీనర్ సుధాకర్‌లు తెలిపారు. ఈ మేరకు నియామక పత్రాలను వారికి అందజేసినట్టు తెలిపారు. పల్లె ప్రతిభను ఈ ప్రపంచానికి పరిచయం చేయాలనే ఉద్దేశంతో కళారంగంలో ఎంతో మందికి అవకాశాలు కల్పిస్తూ తన ప్రతిభతో నియోజకవర్గం పేరును జాతీయ స్థాయిలో నిలబెట్టిన అష్ట దిగంబర్ జన చిత్ర అసెంబ్లీ కన్వీనర్‌గా ఎంపిక కావడంతో ఆయనన సోమవారం పలువురు అభినందించారు. జన చిత్ర పరివార్ నియోజకవర్గ కన్వీనర్‌గా ఎంపిక చేసినందుకు కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

నవతెలంగాణ-నార్నూర్

బాధిత కుటుంబానికి అండగా ఉండి మొదటి విడతలో ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇచ్చేందుకు కృషి చేస్తానని కాంగ్రెస్ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జీ ఆత్రం సుగుణ భరోసా ఇచ్చారు. సోమవారం మండలంలోని నాగల్‌కొండ గ్రామంలో పర్యటించారు. ఇటీవల కురిసిన వర్షంతో వారం రోజుల కింద గొండుగూడ గ్రామానికి చెందిన కుర్సెంగ సీతారామ్ ఇల్లు పూర్తిగా కూలింది. దీనితో పాటు ఇంట్లో ఉన్న నిత్యావసర సరుకులు వస్తువులు చేడిపోయాయి. తినటానికి నిత్యావసర సరుకులు, ఉండటానికి నివాసం లేక ఆందోళన చెందుతున్న క్రమంలో పరామర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల నాయకులతో కలిసి వారికి నిత్యావసర సరుకులు అందించారు. అనంతరం విషయాన్ని తహసీల్దార్‌కు వివరించారు. ఇల్లు కూలిపోయి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని, నిత్యావసర సరుకుల కోసం తక్షణ సాయం చేసి నష్టపరిహారం అందించాలని సూచించారు. వారి వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు లోకండే దేవ్‌రావ్, నాయకులు జాకిరుల్లాఖాన్, మెస్రం మోతీరాం, కుర్సెంగా నగేష్, తొడసం సొంజీ, గోవిందరావ్, మహేందర్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని కౌట్ల(బి), బీరవెల్లి, సారంగాపూర్, గ్రామాలకు చెందిన పలువురు బాధితులను కాంగ్రెస్ నాయకులు మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. కౌట్ల(బి) గ్రామానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త చౌహన్ భీంరావు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలిసి ఇంటికి వెళ్లి ఆయన ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకొని రూ.5వేల ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం బీరవెల్లి గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మలేరియా భూమన్న మృతి చెందారు. సారంగాపూర్ గ్రామానికి చెందిన కందూరు నర్సయ్య అనారోగ్యంతో మృతి చెందారు విషయం తెలుసుకుని బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారి ఆత్మకు శాంతి చేకూరలని, ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు దశరథ్ రాజేశ్వర్, మాజీ అడెల్లి ఆలయ చైర్మెన్ ఉట్ల రాజేశ్వర్, నాయకులు సాకెపెల్లి సురేందర్, పోతారెడ్డి, బట్టు భోజన్న, గ్రామ నాయకులు నర్సయ్య, గంగాధర్, రమణ ఉన్నారు.

బస్సు టైర్ పగిలి తృటిలో తప్పిన ప్రమాదం



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలో సోమవారం శ్రీవెంకటేశ్వర ఆలయం వద్ద నిర్మల్ నుంచి ఆదిలాబాద్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సు ముందరి టైర్ అకస్మాత్తుగా పగిలిపోవడంతో బస్సులో ఉన్న ప్రయాణికులు భయభ్రాంతులకు గురయ్యారు. డ్రైవర్ అప్రమత్తమై చాకచక్యంతో బస్సును ఆపి బస్సులో ఉన్న ప్రయాణికులకు చిన్న గాయం కూడా కాకుండా సురక్షితంగా బస్సును ఆపడంతో బస్సులో ఉన్న ప్రయాణికులు ఒక్కసారిగా ఊపిరి పీల్చుకున్నారు, ఒకసారిగా బస్సు టైర్ పగిలి బస్సు చిందరవందరగా లాగడంతో డ్రైవర్ అప్రమత్తమై ఎటువంటి ప్రమాదం జరగకుండా బస్సులను నిలిపినందుకు బస్ డ్రైవర్‌ను ప్రయాణికులు అభినందించారు.

రైతులకు రశీదు తప్పనిసరి అందించాలి

నవతెలంగాణ-తాంసి

రైతులు కొనుగోలు చేసిన ఎరువులకు క్రిమిసంహార మందులకు సంబంధించిన బిల్లులను కొనుగోలుదారుకు తప్పకుండా బిల్లు ఇవ్వాలని ఏఓ రవీందర్ తెలిపారు. సోమవారం మండలంలోని బండల్‌నాగాపూర్ గ్రామంలో రైతు ఆగ్రో సేవా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. దుకాణాల్లోని స్టాక్ రిజిస్టర్లు ఇతర రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ విత్తనాలు ఎరువులు మందులను ప్రభుత్వం ప్రకటించిన ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువగా ఎవరు విక్రయించిన రైతులు వెంటనే మా అధికారులకు సమాచారం అందించాలని అన్నారు. రైతులు ఫిర్యాదు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. స్టాక్ బోర్డులు ఏర్పాటు చేసి, ధరలను బోర్డుపై రాయాలన్నారు. డీలర్లు ఉద్యేశపూర్వకంగా ఎరువులను బ్లాక్ మార్కెట్ సృష్టించిన అధిక ధరలకు విక్రయించిన చర్యలు తీసుకొని, లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. దుకాణాలలో స్టాక్ రిజిస్టర్లు ఇతర రికార్డులను వ్యవసాయ అధికారి సిబ్బందితో కలిసి పరిశీలించారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలి



- చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి
- సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్

నవతెలంగాణ-ఉట్నూర్

ఎన్నికల ముందు రాష్ట్రవ్యాప్తంగా కార్మికులు చేపట్టిన సమ్మెల సందర్భంగా గత ప్రభుత్వం ప్రస్తుత కాంగ్రెస్ నాయకత్వం ఇచ్చిన హామీలతో పాటు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని, గ్రామ పంచాయతీ కార్మికులకు, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు, మధ్యాహ్నం భోజన కార్మికులకు, ఐకేపీ సిబ్బందికి రూ.26వేలు కనీస వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో కార్మికులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఎన్నికల మేనిఫెస్టోలో కార్మికోద్యోగులకు ఇచ్చిన వాగ్ధానాలను నెరవేర్చాలని అన్నారు. కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ పెన్షన్ ఇన్సూరెన్స్ లాంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్మికులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని అన్నారు. గత ప్రభుత్వంలో కార్మికుల సమస్యలను పట్టించుకోలేదనీ ఆరోపించారు. గ్రామపంచాయతీ, ఆశాల సమస్యల పరిష్కారానికి సీఐటీయూ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన ఛలో హైదరాబాద్ కార్యక్రమాన్ని కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాస్, నాయకులు ప్రశాంత్, దాసు, దుబ్బన్న, అమ్మన్న పాల్గొన్నారు.

విద్యా,వైద్యంతోనే సమాజంలో సంక్షేమం

- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి
- తపస్ ఆధ్వర్యంలో గురు వందనం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమాజంలో సంక్షేమం అంటే విద్య వైద్యమేనని దాన్ని నిర్లక్ష్యం చేస్తే దాని పర్యవసనం పెద్దగా ఉంటుందని హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని జెడ్పీ సమావేశ మందిరంలో తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు ఎమ్మెల్సీని సత్కరించి, జ్ఞాపికలను అందించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ గోడం నగేష్ హాజరై ఉపాధ్యాయ వృత్తిని కొనియాడారు. బాధ్యతగా విధులు నిర్వహించాలని సూచించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో విద్య ఎంతో గొప్పదన్నారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం దాన్ని నిర్లక్ష్యం చేస్తుందని ఆరోపించారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన రూ.2 లక్షల 91 వేల కోట్ల బడ్జెట్లో విద్యా రంగానికి కేవలం రూ.4 వేల కోట్లనే కేటాయించారన్నారు. ఇందులో 85 శాతం వేతనాలకే సరిపోతుందని, 15 శాతం నిధులతో ప్రైమరీ నుంచి యూనివర్సిటీ వరకు ఉన్న సమస్యలను ఎలా పరిష్కరిస్తారని ప్రశ్నించారు. ఉపాధ్యాయులకు బదిలీలు, ప్రమోషన్లు సహజమని, కానీ విద్యార్థిని సమాజంలో మంచి పౌరుడిగా తయారు చేసేలా విద్య బోధనలు చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలు తనకు తెలుసునని చెప్పారు.

పౌరులను తయారు చేసేది ఉపాధ్యాయులే..

ఎంపీ గోడం నగేష్ మాట్లాడుతూ సమాజంలో గురుతర బాధ్యత వహిస్తు మంచి పౌరులను తయారు చేసేది ఉపాధ్యాయులేనని తెలిపారు. సిలబస్ పూర్తి చేశామా తరువాత విద్యార్థి బాదలు పడుతాడని ఆలోచించకుండా బాధ్యతగా ఓ విద్యార్థిని సమాజం, పెద్దలు, సంస్కృతి పట్ల అవగాహన కల్పించేలా వారి బోదనలు ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఈఓ ప్రణీత, తపస్ రాష్ట్ర అధ్యక్షుడు హన్మంతురావ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవ సురేష్, వక్త ఆర్ఎస్ఎస్ ఇందూర్ విభాగ్ ప్రచారక్ శివకుమార్, తపస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సునీల్ చౌహన్, వల్లబోజు గోపికృష్ణ, మనోజ్, మెస్రం రాజ్ కుమార్, నారాయణ, గోమద్ర రెడ్డి, బత్తుల గంగధర్ పాల్గొన్నారు.

కులం పేరుతో అవమానించడం సరికాదు



నవతెలంగాణ-ఉట్నూర్

లంబాడా కులాన్ని పదేపదే అవమానించడం సరికాదని లంబాడా జేఏసీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి బానోథ్ జగన్ అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రెస్‌భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 1976 జీఓ నెంబర్ 108 ప్రకారంగానే అప్పటి కేంద్ర ప్రభుత్వం లంబాడి ఏరియా రిజిస్ట్రేషన్ తీసేసి, తెలంగాణ ప్రాంతంలో రాజ్యాంగ బద్ధంగానే రిజర్వేషన్లు కల్పించడం జరిగిందని అన్నారు. మేము అడ్డదారిలో ఎస్టీలో రాలేదని గుర్తు చేశారు. రాష్ట్రపతి ఆమోదంతోనే, రాజ్యాంగ బద్దంగానే ఎస్టీలో వచ్చామని ఆదివాసీ నాయకులు గుర్తు పెట్టుకోవాలని అన్నారు. రాష్ట్రంలో మంత్రి పదవి అడిగే హక్కు మాకు కూడా ఉందని పేర్కొన్నారు. పదే పదె లంబాడాలను ఎస్టీ జాబితా నుంచి తొలగించాలని అనే విషయాన్ని మార్చిపోవాలని అన్నారు. 1976 తరువాత వచ్చిన వాళ్లను ఎవ్వరూ ఎస్టీలుగా పరిగణనలోకి తీసుకోవడం లేదని అన్నారు. ప్రశాంతమైన వాతావరణాన్ని రెచ్చగొట్టడం మంచిది కాదని కోరారు. ఈ సమావేశంలో లంబాడా జేఏసీ సలహాదారులు జాదవ్ గోపాల్‌రావు, నాయకులు నేతవాత్ రాందాస్, రాథోడ్ సుధాకర్, రాథోడ్ రమేష్ ఉన్నారు.

తపాల శాఖలో వివిధ రకాల పొదుపులపై అవగాహన



నవతెలంగాణ-సారంగాపూర్

మండల కేంద్రంతో పాటు అడెల్లి గ్రామంలో సోమవారం తపాల శాఖలో వివిధ రకాల పొదుపులు, బీమా పథకాల గురించి సబ్ డివిజన్ పోస్టల్ ఇన్స్‌పెక్టర్ దిలీప్ కుమార్, ఐఎఫ్ఎఫ్‌బి మేనేజర్ కళ్యాణ్ ప్రజలకు అవగాహన కల్పించారు. తపాలశాఖ డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ పథకాన్ని ప్రారంభించి, ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్‌లోని ఏఈపీఎస్, పాలసీలు, డిజిటల్ లైఫ్ సర్టిఫికేట్ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ పొదుపు పథకాలకు సంబంధించిన 350 అకౌంట్లు, పాలసీలు ఓపెన్ చేయించారు. ఈ కార్యక్రమంలో భైంసా సబడివిజన్ మేలో వర్సిర్ నరేష్, పవన్, బీపీఎం రాజేష్, మహేంధర్, సుధాకర్, శ్యాంసుందర్, అఖు, వనిత, వరప్రసాద్, అచ్చాఫ్, ప్రవీణ్ ఎబీపీఎం ధబ్బ్యా అజర్, శృతి, సాహరణ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.



అనాథ యువతీ పెండ్లికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని లక్కారం గ్రామానికి చెందిన అనాథ యువతీ కరోనా మహమ్మారి సోకి తల్లిదండ్రులను కోల్పోయిన సీపతి భవాని పెండ్లి కుదరడంతో ఆమె పెండ్లికి ఖర్చుల నిమిత్తం రూ. 20వేలు ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ తన వంతు సాయంగా అందించారు. సోమవారం ఎమ్మెల్యే అనుచరులు ఆమె ఇంటికి వెళ్లి ఎమ్మెల్యే పంపించిన ఆర్థిక సాయాన్ని అందించారు. సాయాన్ని అందుకొన్న సీపతి భవాని, ఆమె బంధువులు ఎమ్మెల్యేకి కృతజ్ఞతలు తెలిపారు.

తాడు సాయంతో వాగులు దాటాలి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

భారీవర్షాలు కురిసినప్పుడు ప్రజలు అటువైపు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ఎస్సై దుబ్బాక సునీల్ అన్నారు. సోమవారం మారుమూల గ్రామాల వాగులను దాటి వెళ్లే, కన్నాపూర్, గోపాల్‌పూర్, గోపాల్‌పూర్ గూడ తదితర గ్రామాల ప్రజలకు అవగాహన కల్పించారు. జిల్లా విపత్తు నివారణ బృందంతో ఆయా వాగులో తాడును కట్టించారు. తీవ్ర వర్షాభావ పరిస్థితుల్లో ప్రజలు వాగును దాటేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించి, తాడు సాయముతో వాగును దాటాలని సూచించారు.

శునకానికి అంత్యక్రియలు



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందని మాజీ జెడ్పీటీసీ గోక గణేష్‌రెడ్డి శునకం మరణించింది. సోమవారం తన ఫామ్ హౌజ్‌లో అంత్యక్రియలు నిర్వహించారు. 16 సంవత్సరాలుగా కుటుంబ సభ్యులతో పాటు మెలిగిన శునకం (లియో) ఆదివారం రాత్రి మృతి చెందింది. జిల్లా కేంద్రంలోని రామ్‌నగర్‌లో ఇల్లు చివరగా ఉండటంతో లియో అనే శునకాన్ని కాపలాగా పెంచుకున్నారు. గత 16 సంవత్సరాలుగా కుటుంబ సభ్యుల కంటే ప్రేమగా చూసుకున్నట్టు మాజీ జెడ్పీటీసీ గోక గణేష్ రెడ్డి తెలిపారు. శునకం మరణించడం మా కుటుంబ సభ్యుల్లో కోల్పోయినట్లుగా భావిస్తున్నట్టు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా సోమవారం ఆదిలాబాద్ నుంచి తన సొంత గ్రామమైన రుయ్యాడి శునకానికి స్నానం కొత్త బట్టలు వేయించి, డబ్బు చప్పుల మధ్య మనుషుల వలె సాంప్రదాయంగా అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో రుయ్యాడి గ్రామస్తులు కారోబారి సంజీవ్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు రమేష్‌రెడ్డి, వెంకన్న యాదవ్, జి.శ్రీనివాస్‌రెడ్డి, ఎం.గంగాధర్, వెంకటేష్, ప్రవీణ్‌రెడ్డి, దివాకర్, జి.సాంబశివ్, సంజీవ్‌రెడ్డి, ఎం.వెంకట్‌రెడ్డి, ఆశోక్‌రెడ్డి, భూమారెడ్డి, బాలాజీ, రావుల నారాయణ, రాకేష్, మహేందర్ గ్రామస్తులు పాల్గొన్నారు.

బురదకు నిలయంగా ప్రభుత్వ కార్యాలయాలు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని వివిధ ప్రభుత్వ తహసీల్దార్, ఎంపీడీఓ, పశువర్ధకశాఖ ముఖ్యమైన కార్యాలయాలకు వెళ్లాలంటేనే బురదతో సహవాసం చేయాల్సిందే. ఈ కార్యాలయాలకు ప్రతినిత్యం వివిధ పనుల నిమిత్తం పదుల సంఖ్యలో ప్రజలు వెళుతుంటారు. ప్రధాన రోడ్డు పక్కనే ఆ కార్యాలయాలకు వెళ్లే రహదారి గుంతలుగా మారి బురదకు నిలయంగా మారింది. జిల్లా ఉన్నతాధికారులు సైతం అటుగా వెళ్లాలన్న బురదను దాటి వెళ్లాల్సిందే. ఆయన రహదారి పై ఇటు అధికారులు, ప్రజాప్రతినిధులు గాని దృష్టిపెట్టడం లేదని స్థానిక ప్రజలు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా ఈ రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగి ఉండాలి



నవతెలంగాణ-కడెం

సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఖానాపూర్ సీఐ సైదారావు సూచించారు. సోమవారం మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామంలోని తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. బాలికలకు ఎలాంటి ఆపద వచ్చినా డయల్ 100ను సంప్రదించాలని కోరారు. అనంతరం పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, అన్ని రికార్డులు, యూఐ కేసులను తనిఖీ చేశారు. యూఐ కేసులను తగ్గించాలని సూచించారు. సిబ్బందితో సమావేశం నిర్వహించి, బ్లూకోర్ట్, పాట్రో కార్ విధులు, డయల్ 100 ప్రాముఖ్యత గురించి వివరించారు. అనుమానిత వ్యక్తులు, సస్పెక్ట్, రౌడీ షీటర్లందరినీ తనిఖీ చేయాలని ఆదేశించారు. అలాగే విజిబుల్ పోలీసింగ్ ప్రాముఖ్యత గురించి వివరించడంతో పాటు ప్రజలతో సత్ప్రవర్తన కలిగి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కడెం ఎస్ఐ కృష్ణ సాగర్‌రెడ్డి, పోలీసు సిబ్బంది ఉన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
మంగళవారం | జులై 30, 2024 | www.navatelangana.com

గణేష్‌పూర్‌లో ఇంటింటి సర్వే

నవ తెలంగాణ-వాంకిడి



మండలంలోని గణేష్‌పూర్ గ్రామంలో ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించి వర్షాకాలంలో వచ్చే అంటూ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి ఆవరణలో శుభ్రంగా ఉంచుకోవాలని, టైర్లు, ఖాళీ కొబ్బరి బోండాలు, చిప్పలు ఇంటి పరిసరాలకు దూరంగా వేయాలని ప్రజలకు తెలియజేశారు. అనంతరం వైద్య శిబిరం నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అంటు వ్యాధుల పట్ల ప్రజలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచే విధంగా చూసుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఆరోగ్య విస్తరణ అధికారి రవిదాస్ తెలిపారు. కార్యక్రమంలో కారోబార్ గోపాలరావు, ఆశ వర్కర్లు, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు

నవతెలంగాణ-దహెగాం



మండలంలోని గిరవెల్లి నుండి కర్జికి వెళ్లే రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల గుంతల మయం కావడంతో సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీష్ బాబు సూచన మేరకు బీజేపీ నాయకులు మరమ్మత్తులు చేశారు. సోమవారం పాల్వాయి సుధాకర్ రావు, మండల అధ్యక్షుడు రాపర్తి ధనుంజయ ఆధ్వర్యంలో రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టారు. దీంతో రాకపోకలకు కాస్తంత ఉపశమనం కలగడంతో ఆ గ్రామాల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు తిరుపతి గౌడ్, ప్రభాకర్, శంకర్, రాజన్న, కొటారి బాబు పాల్గొన్నారు.

నీటి కుంటలో పడి బాలుడు మృతి

నవతెలంగాణ-బెజ్జూర్

సరదాగా ఆటలాడుకుంటూ వెళ్లిన బాలుడు నీటి కుంటను గుర్తించక అందులో పడి మృతి చెందిన సంఘటన మండలంలోని మర్తిడి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మర్తిడి గ్రామానికి చెందిన షిఫాన్(6) ప్రాథమిక పాఠశాలలో ఒకటవ తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సోమవారం సెలవు ఉండడంతో తోటి స్నేహితులతో కలిసి సరదాగా ఆటలాడుకోవడానికి గ్రామ సమీపంలోకి వెళ్లారు. ఆటలాడుతున్న క్రమంలో పొక్లెన్తో తోడిన నీటి కుంటలో ప్రమాదవశాత్తు పడ్డాడు. దీనిని గమనించిన తోటి స్నేహితులు ఇంటి వాళ్లకు తెలపడంతో సంఘటన స్థలానికి కుటుంబీకులు చేరుకొని బాలుని కుంట నుండి బయటకు తీశారు. ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గం మధ్యలో మృతి చెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. తండ్రి యూసుఫ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. షిఫాన్ మృతి ఆ కుటుంబంలో తీరని శోకాన్ని మిగిల్చింది.

తమ్మినేనికి మున్సిపల్ కార్మికుల వినతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం బెల్లంపల్లికి వచ్చిన సీపీఐ (ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకు వినతిపత్రం ఇచ్చారు. తమకు నాలుగు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని, సుమారు రూ. 2 కోట్ల వరకు పీఎఫ్ బకాయిలను తమ ఖాతాలలో జమ చేయాల్సి ఉందని, ఈఎస్ఐ కూడా చెల్లించకపోవడంతో తమకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని కార్మికులు తమ్మినేనికి వివరించారు. తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి పరిష్కారానికి కృషి చేయాలని వారు కోరారు. వినతిపత్రం అందించిన వారిలో సీఐటీయూ అనుబంధ తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఇ శంకర్, జి సంజీవ్, నాయకులు మల్లేష్, శంకరమ్మ, పి రమేష్, భూమయ్య పాల్గొన్నారు.

గుండెపోటుతో ప్రధానోపాధ్యాయుడి మృతి

నవతెలంగాణ-ముధోల్

గుండె పోటుతో ప్రధానోపాధ్యాయుడు మృతి చెందిన సంఘటన భైంసా పట్టణంలో సోమవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మచ్కల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహించే పద్మాకర్(57) సోమవారం మధ్యాహ్నం గుండెపోటుతో మృతి చెందాడు. భైంసాలోని తన ఇంటిలో మధ్యాహ్నం సమయంలో గుండె పోటు రావడంతో తన కుటుంబ సభ్యులు వెంటనే పట్టణంలోని ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, బంధువులు శోకసంద్రంలో మునిగారు. అందరిని కలుపుగోలుగా మాట్లాడే ప్రధానోపాధ్యాయుడు గుండె పోటుతో మృతి చెందడన్న వార్త జీర్ణించుకోలేక పోయారు. అంత్యక్రియలు మంగళవారం భైంసాలో జరుగానున్నట్టు కుటుంబీకులు తెలిపారు.

సీఎంపీసీ చిట్టీలు అందజేత

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా ఖైరగూడ ఓపెన్ కాస్ట్‌లో గని మేనేజర్ ప్రవీణ్ పాంటింగ్, వెల్ఫేర్ ఆఫీసర్ నాగుల వేణు, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీఎంపీసీ చిట్టీలను కార్మికులకు అందించారు. కార్యక్రమంలో గోలేటి బ్రాంచ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి జూపాక రాజేష్, షిఫ్ట్ ఇన్‌చార్జి పుట్ట అంజన్న, ఎండీ షకీల్ పాల్గొన్నారు.

ఆదమరిస్తే అంతే..

- కల్వర్టు వద్ద పొంచి ఉన్న ప్రమాదం



నవతెలంగాణ-కెరమెరి

అడమరిచి వాహనం నడిపారో ఇక అంతే సంగతులు.. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని జైరాంగూడ సమీపంలో ఉన్న కల్వర్టు వద్ద రోడ్డు ఇరువైపులా కోతకు గురైంది. దీంతో కల్వర్టు వద్ద వాహనదారులు అదుపు తప్పి పడిపోయే ప్రమాదం ఉంది. గతంలో ఓ వాహనదారుడు రాత్రి సమయంలో ద్విచక్ర వాహనంపై నుంచి అదుపు తప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు కొనసాగించే రహదారి కావడంతో ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోక ముందే మరమ్మతులు చేపట్టాలని పరిసర గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

శిలాఫలకం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నిర్మల్

టీఎస్‌యూటీఎఫ్ భవన శిలాఫలకం ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి శంకర్, పెంట అశోక్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రం భాగ్యనగర్ కాలనిలోని స్థలాన్ని పరిశీలించారు. భవన శిలాఫలకాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గతంలో 2008వ సంవత్సరంలో అప్పటి పార్లమెంట్ సభ్యులు, మాజీ మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్‌రెడ్డి ఆధ్వర్యంలో సంఘానికి ఈ స్థలానికి కేటాయించారని అన్నారు. ఇట్టి స్థలం రిజిస్ట్రేషన్ సైతం సంఘం పేరు మీద జరిగిందన్నారు. శిలాఫలకాన్ని ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకులు నాకిడి బక్కన్న, నాగయ్య కుర్మే, పుట్ట రవి కిరణ్, మారపాక భీమయ్య, గోవర్ధన్‌రావు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

అటవీ సంపద కాపాడమే లక్ష్యం

- వన్యప్రాణల రక్షణకు చర్యలు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

అటవీ సంపదను కాపాడమే లక్ష్యంగా అధికారులు పని చేస్తున్నారు. సిర్పూర్ రెంజ్‌లో అటవీ క్షేత్ర అధికారి చిబుక పూర్ణచందర్ నేతృత్వంలో రేంజ్ పరిధిలో అటవీ విస్తరణ, వన్యప్రాణుల సంరక్షణ ప్రతి రోజు క్రమం తప్పకుండా సిబ్బంది పర్యవేక్షిస్తూ విధుల పట్ల అప్రమత్తం చేస్తున్నారు. సిర్పూర్ రేంజ్‌లో 27 వేల హెక్టార్లలో అటవీ విస్తీర్ణం ఉంది. అటవీని పర్యవేక్షించడానికి ఎనిమిది సెక్షన్లు విభజించి 25 బీట్లు చేశారు. అటవీ ప్రాంతంలో ముఖ్యంగా పులి, చిరుత, ఇండియన్ గార్, అడవి కుక్కలు, దుప్పులు, కొండగొర్రెలు, అడవీ పందులు ప్రధాన జీవరాసులు నివసిస్తున్నాయి. వీటి సంరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు.

దాహార్తిని తీర్చేందుకు ప్రత్యేక చర్యలు

వేసవికాలంలో వీటి దాహార్తిని తీర్చేందుకు ఐదు చెక్ డ్యాంలు, 30 నీటి కుంటలు, 25 సాసర్పేట్లు ఏర్పాటు చేశాపారు. వేసవి కాలంలో సాసర్పేట్లలో వారానికి రెండు దఫాలు నీటి ట్యాంకర్‌తో నీటిని నింపుతున్నారు. ఆ సాసర్పేట్లలో వన్యప్రాణులు నీటిని తాగిన దృశ్యాలు కెమెరా ట్రాప్లలో రికార్డులు అవుతుంటాయి. అలాగే ముఖ్యంగా శాఖాహార జంతువుల కోసం 40 గడ్డి క్షేత్రాలు పెంచి వాటికి సరిపడా ఆహారాన్ని అందిస్తున్నారు. వేసవి కాలంలో దట్టమైన అటవీలో కార్చిచ్చులను గుర్తించడానికి చింతకుంట, మాలిని ప్రాంతాల్లో రెండు ఫైర్ వాచ్‌టవర్లు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు. వాటి పైకి ఎక్కి సులభంగా కార్చిచ్చులను గుర్తించి వాటిని ఫైర్‌బయర్ సాయంతో తీస్తున్నారు. అలాగే ముందస్తుగా అన్ని బీట్లలో ఫైర్లైన్లను చూసి కార్చిచ్చు. మూడు సంవత్సరాల నుంచి సిర్పూర్ రేంజ్‌లో అటవీ ప్రాంతాల్లో రోడ్లను నిర్మిస్తున్నారు. ఎక్కడికైనా అటవీ ప్రాంతాల్లో ఎలాంటి సంఘటనలు జరిగిన త్వరగా సంఘటన స్థలానికి వెళ్లే విధంగా రోడ్డు సౌకర్యాలు ఏర్పాటు చేసుకున్నారు. అదేవిధంగా ఇతరులు అటవీ క్షేత్రానికి వెళ్లకుండా నిషేధిత హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు.



కుంటలో నీరు నింపుతున్న అటవీ సిబ్బంది(ఫైల్)



అటవీ ప్రాంతంలో నాటిన మొక్కలకు కాసిన కాయలు

అటవీ విస్తీర్ణానికి మొక్కలు

అటవీ విస్తీర్ణాన్ని పెంచడానికి మూడు సంవత్సరాల క్రితం ఇటుకలపహాడ్, భూపాలపట్నం, డబ్బా బీట్లలో 160 హెక్టార్లలో మొక్కలు పెట్టారు. ప్రస్తుతం ఇటుకలపహాడ్, కేశవపట్నం బీట్లలో 130 హెక్టార్ల, ప్రస్తుత సంవత్సరం ఇటుకలపహాడ్ 180 హెక్టార్లు, ఆడపెల్లిలో 10 హెక్టార్లు అటవీ భూమిని రీ ట్రీ చేసి ప్లాంటేషన్ చేస్తున్నారు. గతంలో అటవీ ప్రాంతాలలో నటిన మొక్కలు ప్రస్తుతం కాయలు కాస్తున్నాయయి. భవిష్యత్తులో మరిన్ని ప్లాంటేషన్లు చేపట్టి ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మనకు ముఖ్యంగా తడోబా నుంచి వచ్చే పులులు మాకిడి సెక్షన్ గుండా తెలంగాణలోకి ప్రవేశిస్తున్నాయి. అయితే ఇటుకలపహాడ్‌లో అటవీ భూములు మొత్తం అన్యక్రంతం అవడం వల్ల పులులు తిరిగి మహారాష్ట్రకు తరలిపోతున్నాయి. రెండు సంవత్సరాల క్రితం ఇటుకలపహాడ్‌లో చేపట్టిన ప్లాంటేషన్ వల్ల ప్రస్తుతం పులులకు ఎలాంటి ఆటంకం లేకుండా స్వేచ్ఛగా మన రాష్ట్రంలోకి వచ్చే అవకాశాలు కల్పించారు. అటవీ సమీపంలో గల గ్రామాల ప్రజలకు వాటిని సంరక్షించడానికి ఆడవులను నరకకుండా వాటిని కాపాడే బాధ్యత మనపై ఉందని అవగాహన కార్యక్రమాలు చేపడుతూనే పులి దాడిలో పశువుల యజమానులకు సహకారం, ప్రభుత్వం నుంచి నష్టపరిహారం అందే విధంగా చర్యలు తీసుకుంటున్నారు.

అడవిని సంరక్షించాలి

-చిబుక పూర్ణచందర్, అటవీ క్షేత్ర అధికారి



అటవీని సంరక్షించే బాధ్యత అందరిపై ఉంది. శాఖ పరంగా అడవుల రక్షణకు తాము చర్యలు తీసుకుంటున్నాం. వన్యప్రాణులు తిరిగే స్థలాలను గుర్తించి తాగు నీటి కోసం వేసవిలో ప్రత్యేక చర్యలు చేపట్టాం. అటవీ శాతాన్ని పెంచడానికి విరివిగా ఈ వర్ష కాలంలో మొక్కలు నాటేల ప్రణాళికలు చేస్తున్నాం. ప్రజలు కూడా సహకరించి అడవుల శాతం పెంచేలా మొక్కలను విరివిగా నాటాలి.

పులుల రక్షణతో వాతావరణ సమతుల్యత సాధ్యం

- డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్
- ఘనంగా అంతర్జాతీయ పులుల దినోత్సవం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

పులుల సంరక్షణతోనే వాతావరణ సమతుల్యత సాధ్యమవుతుందని ఆసిఫాబాద్ డిప్యూటీ రేంజ్ అధికారి యోగేష్ తెలిపారు. జిల్లా కేంద్రంలో అటవీ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా అంతర్జాతీయ పులుల దినోత్సవం నిర్వహించారు. దీంలో భాగంగా జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా బైక్ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులుల సంరక్షణతో వాతావరణ సమతుల్యత సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పోడుసాగు వల్ల అటవీ విస్తీర్ణం తగ్గడంతో పులుల సంరక్షణ కష్టంగా మారిందన్నారు. కవ్వాల్ టైగర్ రిజర్వ్‌లో గతంతో పోలిస్తే పులుల సంచారం పెరిగిందని తెలిపారు.



ఆసిఫాబాద్ : ర్యాలీ నిర్వహిస్తున్న అటవీ శాఖ అధికారులు

దీనిని మరింత పెంచాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. దీనికి అడవులను నరకకుండా ఉండడమే పరిష్కారమన్నారు. జిల్లాలోని గిరిజనులకు పలుచోట్ల వెదురుతో వస్తువులు ఏవిధంగా తయారు చేయాలనే అంశాన్ని నేర్పించామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ రేంజ్ అధికారులు సరోజరాణి, రాజేశ్వర చారి, సెక్షన్ అధికారులు సాయి, లక్ష్మణ్, బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ : లంకుసాపూర్ గ్రామంలో అవగాహన కల్పిస్తున్న అటవీ శాఖ సిబ్బంది

కాగజ్‌నగర్ : అంతర్జాతీయ పులుల దినోత్సవం పురస్కరించుకొని సోమవారం కాగజ్‌నగర్‌లో అటవీ శాఖ సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని స్థానిక అటవీ శాఖ కార్యాలయం వద్ద ఇన్‌ఛార్జి ఎఫ్‌డీఓ అప్పలకొండ ప్రారంభించారు. పట్టణంలోని పలు ప్రధాన వీధుల గుండా ఈ ర్యాలీ సాగింది. అనంతరం మండలంలోని వంజిరి, నందిగూడ, అంకుసాపూర్ గ్రామాలలో కళాజాత బృందాలచే ప్రదర్శనలు ఇచ్చారు. పులుల ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్‌లో ఎఫ్‌ఆర్‌ఓ రమాదేవితో పాటు డివిజన్‌లోని ఆయా రేంజ్‌ల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

లారీ, ద్విచక్ర వాహనం ఢీ

- ఒకరికి గాయాలు

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని గోయగావ్ సమీపంలో లారీ, ద్విచక్ర వాహనం ఢీకొని ఒకరికి తీవ్ర గాయాలైనట్లు ఎస్సై సాగర్ తెలిపారు. గోయగావ్ సమీపంలో జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో వస్తున్న లారీ(టీఎస్ 52 8961) ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. మధ్యప్రదేశ్‌కు చెందిన బాదుసింగ్ వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో పోలీసులు ఆసిఫాబాద్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బోనాల పండగను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-కౌటాల

వచ్చే ఆదివారం నిర్వహించే బోనాల పండుగను విజయవంతం చేయాలని ఆలయ కమిటీ చైర్మన్ సులువ కనకయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని మహిళా భక్తులు బోనం ఎత్తుకొని రామాలయం నుండి కంకలమ్మ ఆలయం వరకు ర్యాలీగా వచ్చి కంకలమ్మ దేవికి బోనం సమర్పించుకొని మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.

నిండు ప్రాణాన్ని బలిగొన్న వివాహేతర సంబంధం

నవతెలంగాణ-దహెగాం



భార్య అక్రమ సంబంధం ఓ భర్త నిండు ప్రాణాన్ని బలికొంది. దీంతో కుటుంబం రోడ్డున పడ్డ సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై కందూరి రాజు తెలిపిన వివరాల ప్రకారం దహెగాం మండల కేంద్రానికి చెందిన బండ మల్లేష్(33) మంజుల భార్యాభర్తలు. కూలీనాలి చేసుకుంటూ అనోన్యంగా జీవిస్తున్న వీరికి ఒక పాప కూడా ఉంది. వీరి సంసారంలో కొన్ని రోజులుగా గొడవలు మొదలయ్యాయి. వీటికి కారణం గ్రామానికి చెందిన మరో వ్యక్తితో భార్య అక్రమ సంబంధం పెట్టుకోవడమే. దీంతో మల్లేష్‌కు తెలిసి గొడవపడి కొన్ని నెలలు భార్య, భర్తలు విడిగా ఉన్నారు. 4నెలల క్రితం మల్లేష్ అన్నలు వారిరువురికి నచ్చజెప్పి మంజులను ఇంటికి తీసుకొచ్చి ఒకటి చేశారు. అయినా ఆమె తన తీరు మార్చుకోక పోవడంతో మల్లేష్ తాగుడుకు బానిస కావడంతో ఆరోగ్యం క్షీణించింది. ఆదివారం పరిస్థితి విషమించడంతో మంచిర్యాల హాస్పిటల్ తీసుకెళ్తుండగా మార్గ మధ్యలో మృతి చెందాడు. మృతి పట్ల అనుమానముందని మృతుని అన్న బండ సత్యన్న ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై పేర్కొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు

నవతెలంగాణ-కౌటాల

శివాలయంలో ఆలయ అర్చకులు అంబేద సంతోష్ అధ్వర్యంలో ఆషాఢ మాసం చివరి సోమవారం కావడంతో పదకొండు జంటలతో పాలాభిషేకం చేశారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందజేశారు. ఆలయంలో భక్తులు శివునికి ముందుగా పూజలు చేశారు. ప్రతి ఏటా పూజాది కార్యక్రమాలు నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలిపారు. ఈ పూజలో రవీంద్రనగర్‌కు చెందిన బెంగాలీలు అధిక సంఖ్యలో పాల్గొని శివుని దర్శించుకున్నారు.

నేడు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరుతూ మంగళవారం బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో ఆసిఫాబాద్‌లో జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందించనున్నట్లు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు చప్పిడి సత్యనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కామారెడ్డిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభలో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి బీసీలకు పలు హామీలిచ్చారని, వాటిని అమలు చేసేందుకు మాత్రం బడ్జెట్‌లో తగిన నిధులు కేటాయించలేదని ఆరోపించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని కోరుతూ మంగళవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. ఇచ్చిన హామీని అమలు చేయాలని లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామన్నారు.

స్పందించి..సరుకులు అందించి

నవతెలంగాణ-చింతలమానేపల్లి



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని దిందా గ్రామానికి వారం రోజుల నుండి రాకపోకలు స్తంభించాయి. ఆదివారం మండలాల పర్యటనలో ఉన్న ఎమ్మెల్సీ దండే విఠల్‌కు స్థానిక నాయకులు ఈ విషయం ఆయన దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఆయన సోమవారం గ్రామ ప్రజలకు నిత్యావసర వస్తువులు, కూరగాయలు పంపించారు. అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ఆయన రాకపోయినా నిత్యావసర వస్తువులు, కూరగాయలను ప్రజలకు పంపించారు. ఎమ్మెల్సీ దండే విఠల్ మంచి మనసుకు గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలుపుతూ, ఆపదలో ఉంటే తక్షణమే స్పందించి అత్యవసర పరిస్థితిలో అక్కున చేర్చుకునే నేత అని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు మాజీ జెడ్పీ చైర్మెన్ సిడాం గణపతి, మాజీ ఎంపీపీలు డుబ్బుల నానయ్య, విశ్వనాథ్, నియోజకవర్గ నాయకులు ఠాకూర్ రాణా ప్రతాప్ సింగ్ పాల్గొన్నారు.

నేడు 2వ విడత రైతు రుణమాఫీ : కలెక్టర్ వెంకటేష్ ధోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్



రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు రుణమాఫీ పథకంలో భాగంగా నేడు 2వ విడత రుణమాఫీ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరుగుతుందని కలెక్టర్ వెంకటేష్ ధోత్రే ఒక ప్రకటనలో తెలిపారు. 2వ విడతలో రూ. లక్ష నుండి రూ. 1.50 లక్షల వరకు రుణం మాఫీ చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. నేడు మధ్యాహ్నం 12 గంటలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులతో కలిసి రుణమాఫీని లాంఛనంగా ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల18న మొదటి విడత రుణమాఫీ నిర్వహించిన తరహాలో 2వ విడత రుణమాఫీ పథకం అమలు చేస్తామన్నారు. జిల్లాలో 2వ విడత రైతు రుణమాఫీ పథకంలో 14,623 మంది రైతులకు రూ.153 కోట్ల 34 లక్షల 94 వేల 379 అందించనున్నట్లు పేర్కొన్నారు.

కుంగిన రోడ్డు..యువకుల శ్రమదానం

నవతెలంగాణ-వేమనపల్లి



ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని ముల్కలపేట, రాచర్ల మధ్యలో ఉన్న బొందచెను ఒర్రే బ్రిడ్జీ అప్రోచ్ రోడ్డు ప్రాణహిత నది వరద తాకిడికి కోతకు గురైంది. కనీసం ద్విచక్ర వాహనాలు కూడా వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ప్రాణహిత నదివరద తగ్గుముఖం పట్టడంతో గ్రామానికి చెందిన యువకులు శ్రమదానం చేసి బ్రిడ్జీకి ఇరువైపుల కంకర పోసి ద్విచక్ర వాహనలు వెళ్లడానికి దారి ఏర్పాటు చేశారు. దాంతో దారిపైన వెళ్తున్న వాహన దారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లపెల్లి వెంకటి, కొండ్ర పున్నం, ముంజం లచ్చన్న, డోలె రాజబాపు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలి

- ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ

నవతెలంగాణ-మంచిర్యాల



పట్టణంలోని ఆటో డ్రైవర్లు జాగ్రత్తలు పాటించాలని ట్రాఫిక్ సీఐ సత్యనారాయణ అన్నారు. సోమవారం పట్టణంలోని ఐబీ చౌరస్తాలో ఆటో డ్రైవర్‌లతో సమావేశం ఏర్పాటు చేసి మహిళ ప్రయాణికుల పట్ల మర్యాదగా ప్రవర్తించాలని, వర్ష కాలంలో ప్రయాణికుల రక్షణకు తీసుకోవాల్సిన నియమాలను సూచించారు. ఆటోలను ఇష్ట రీతిన పార్కింగ్ చేస్తూ వాహనదారులు, పాదచారులకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బ్లాక్ ఫిల్మ్ వేసుకొని తిరుగుతున్న పలు వాహనాల బ్లాక్ ఫిల్మ్‌లను తొలగించారు.

ఇండ్ల స్థలాలకు పట్టాలు అందించాలి

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేనికి వినతి



నవతెలంగాణ-జైపూర్

చెన్నూరు మండలం బావురావుపేట శివారులోని రాజన్న కాలనీలో నివసించే కాలనీ వాసులకు ఇండ్ల పట్టాలు ఇప్పించాలని కోరుతూ సింగరేణి పరిరక్షణ బస్సు ప్రారంభ సభకు హాజరైన సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకు వినతిపత్రం అందించారు. సమస్యలపై స్పందించిన తమ్మినేని వీరభద్రం పట్టాలు ఇచ్చి అన్ని సౌకర్యాలు కల్పించేంత వరకు మీ వెనకాల ఉంటామని హామీ ఇచ్చినట్లు కాలనీ వాసులు తెలిపారు. కార్యక్రమంలో బోడంకి చందు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు, కావి రవి, మండల కార్యదర్శి కోటపల్లి సమ్మక్క, ఉమారాణి, నాగజ్యోతి, నాగేష్, బోండ్ల సరిత, కరింబీ, పద్మా శారద, రేణుక, కుమార్, శ్రీనివాస్, మధు, రమాదేవి, సత్తన్న, లక్ష్మి పాల్గొన్నారు.

గని మేనేజర్ కూతురు మృతి బాధాకరం

నవతెలంగాణ-నస్పూర్

ఢిల్లీలో భారీ వర్షాలతో ప్రముఖ కోచింగ్ సెంటర్‌లో సెల్లర్‌లో నీరు చేయడంతో ఎస్ఆర్పీ 1 గని మేనేజర్ విజయ్ కుమార్ కుమార్తె తానియా సోనీ వరద నీటిలో చిక్కుకొని మృతి చెందడం బాధాకరమని ఐఎన్‌టీయూసీ ఏరియా ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలుపుతూ శ్రీరాంపూర్ బ్రాంచ్ తరఫున తానియా సోనికి ఘన నివాళులర్పిస్తున్నామని పేర్కొన్నారు.

గని మేనేజర్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి

గని మేనేజర్ విజయకుమార్ కూతురు ప్రమాదవశాత్తు మరణించడం చాలా బాధాకరమైన విషయమని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నట్లు హెచ్ఎంఎస్ శ్రీరాంపూర్ బ్రాంచ్ నాయకులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రమాదానికి బాధ్యులైన వారిపై చర్యలు తీసుకొని మేనేజర్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

వృత్తి శిక్షణల్లో రాణించాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సేవా సమితి ఆధ్వర్యంలో అందిస్తున్న వృత్తి శిక్షణల్లో రాణించాలని సేవ అధ్యక్షురాలు రాధా కుమారి, శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి అన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరంలో వృత్తి శిక్షణ తీసుకుని రాత పరీక్షలో ఉత్తీర్ణులైన 250 మంది అభ్యర్థులకు సోమవారం ప్రగతి స్టేడియంలోని క్లబ్‌లో ఖాదీ గ్రామ ఉద్యోగ సర్టిఫికెట్లను అందజేశారు. అలాగే ఆషాడ మాసం సందర్భంగా గోరింటాకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి, సేవ అధ్యక్షురాలు రాధా కుమారి పాల్గొని సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. శ్రీరాంపూర్ ఏరియా ఎస్ఆర్పీ1 గని మేనేజర్ విజయ కుమార్ కూతురు తాన్య సోని మరణానికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియాలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో మహిళలు వివిధ వృత్తి శిక్షణ కోర్సులను నేర్చుకుని పరీక్షలలో ఉత్తీర్ణులై సర్టిఫికెట్లను అందుకోవడం చాలా సంతోషకరమైన విషయమని అన్నారు. నేర్చుకున్న కోర్సుల ద్వారా మీ కుటుంబానికి ఆర్థికంగా చేయూత అందించే ఉద్దేశంతో సింగరేణి యాజమాన్యం ఈ శిక్షణ శిబిరాలను ఏర్పాటు చేసిందన్నారు. అలాగే తెలంగాణ సంప్రదాయాలలో ఆషాడంలో గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తుందని సేవా సభ్యురాళ్లతో ఈ కార్యక్రమంలో పాల్గొనడం చాలా సంతోషంగా ఉందన్నారు. సేవా అధ్యక్షురాలు రాధా కుమారి మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి వ్యాప్తంగా పెద్దదని ఇక్కడ చాలామంది మహిళలు వృత్తి శిక్షణ కోర్సులను నేర్చుకోవడం, పదిమందికి ఉపాధి కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, డీజీఎం పర్సనల్ అరవింద రావు, సీనియర్ పీఓపీ కాంతారావు, సేవా సెక్రటరీ కొట్టే జ్యోతి పాల్గొన్నారు.

ట్రస్మా పట్టణ అధ్యక్షుడిగా రామకృష్ణ

నవతెలంగాణ-నస్పూర్

ట్రస్మా(తెలంగాణ రికగ్నైజ్డ్ స్కూల్ మేనేజ్మెంట్ అసోసియేషన్) నస్పూర్ పట్టణ అధ్యక్షుడిగా కృష్ణ కాలనీలోని ఎయిమ్స్ పాఠశాల కరస్పాండెంట్ మైదం రామకృష్ణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం సీసీసీ కార్నర్‌లోని సృష్టి ఇనిస్టిట్యూట్లో జరిగిన ట్రాస్మా మండల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లెత్తుల రాజేంద్రపాణి, రాష్ట్ర సహాయ కార్యదర్శి పెట్టెం మల్లయ్య, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రేగళ్ల ఉపేందర్ ఆధ్వర్యంలో పట్టణ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మైదం రామకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా లిటిల్ రోబోస్ కరస్పాండెంట్ ఊట్ల సత్యనారాయణ, కోశాధికారిగా సృష్టి ప్లే స్కూల్ కరస్పాండెంట్ అంబాల రాజ్ కుమార్, ఉపాధ్యక్షుడిగా రెయిన్‌బో ప్లే స్కూల్ కరస్పాండెంట్ చెన్నూరి అమన్ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ తమను ఎన్నుకున్న వారికి కృతజ్ఞతలు తెలిపారు. పట్టణంలోని ప్రయివేట్ పాఠశాలలలో సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పలు పాఠశాలలకు చెందిన కరస్పాండెంట్లు పాల్గొన్నారు.



సింగరేణి ప్రమాదంలో పడింది

- ప్రయివేటీకరణ చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ కుట్రలు
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం



నవతెలంగాణ-కాసిపేట

సింగరేణి ప్రమాదంలో పడిందని, ప్రయివేటీకరణ చేసేందుకు కాంగ్రెస్, బీజేపీ కుట్ర చేస్తుందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పేర్కొన్నారు. సోమవారం సింగరేణి పరిరక్షణ బస్సు యాత్రను బెల్లంపల్లిలో ప్రారంభించినంతరం మండలంలోని సోమగూడెంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ అందరూ ప్రయివేటీకరణకు వ్యతిరేమని అంటూనే చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. దీనికి నిదర్శనం శ్రావణపల్లి బొగ్గు బ్లాకును వేలం పాడడమేనన్నారు. వేలం పాటలో కిషన్ రెడ్డి, భట్టి విక్రమార్కలున్నట్లు, సీఎం రేవంత్ రెడ్డి కూడా నోరు మెదపడం లేదని ఎద్దేవా చేశారు. అప్పటి ప్రధాన మంత్రి పీవీ నర్సింహారావు, ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ హయాంలోనే ఆర్థిక సంస్కరణలు చేపట్టారన్నారు. దేశంలో బొగ్గు బ్లాకులను అదానీకి అప్పగించి సింగరేణిని ప్రయివేటీపరం చేసేందుకు కుట్రలు చేస్తున్నాయన్నారు. బొగ్గు గనులలో గతంలో లక్ష వరకు ఉద్యోగులుంటే నేడు 40 వేల మంది ఉన్నారన్నారు. 900 కోట్ల టన్నుల బొగ్గు నిక్షేపాలు ప్రాణహిత, గోదావరి తీరాలల్లో ఉన్నాయన్నారు. ఇక్కడ బొగ్గు గనులను ఏర్పాటు చేస్తే వందల ఏండ్ల పాటు లక్ష మంది ఉద్యోగులతో పాటు వేరే వృత్తుల వారు కూడా అభివృద్ధి చెందుతారన్నారు. సింగరేణి పరిరక్షణకు ఈ రోజు నుంచి ఆగస్టు 5 వరకు ఎనిమిది రోజుల పాటు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా ప్రజల్లో చైతన్యం చేసి ప్రభుత్వాలపై ఒత్తిడి చేసేందుకు ఈ బస్సు యాత్రను చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ బడ్జెట్ సమావేశంలోనే శ్రావణపల్లి బొగ్గు వేలాన్ని రద్దు కోసం తీర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్య ప్రాధాన్యతను వివరించి ప్రజలను చైతన్య పరుస్తూ ఐక్యకార్యాచరణతో తెలంగాణాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్కా రాములు, జిల్లా కార్యదర్శి సంకె రవి, కార్యదర్శివర్గ సభ్యులు దాసరి రాజేశ్వరి పాల్గొన్నారు.

సింగరేణి ఉద్యోగం పేరుతో టోకరా



నవతెలంగాణ-మంచిర్యాల

సింగరేణి ఉద్యోగం ఇప్పిస్తానని మాయ మాటలు చెప్పి బాధితులను మోసం చేసిన వ్యక్తినీ మంచిర్యాల పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సోమవారం మంచిర్యాల పట్టణ సీఐ బన్సిలాల్ తెలిపిన వివరాలు ప్రకారం సోమాగూడెంకు చెందిన సింగరేణి ఉద్యోగి విష్ణు అతనికి పరిచయస్తుడు అయిన హరికిషన్ దాస్‌తో కలిసి మంచిర్యాల పట్టణానికి చెందిన బేర నగేష్ కుమార్ భార్యకు సింగరేణి ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మ బలికి ఉద్యోగానికి రూ.15 లక్షలు ఖర్చు వస్తుందని, ముందస్తుగా 2022లో రూ.5 లక్షలు తీసుకున్నారు. కొన్ని రోజుల తరువాత నగేష్‌కు అనుమానం వచ్చి ఇరువురిని నిలదీశాడు. హరికిషన్, విష్ణులు ఇద్దరు తప్పించుకునే ప్రయత్నం చేశారు. వారి పై అనుమానాలు వ్యక్తం అవడంతో బాధితుడు మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఇరువురిని అదుపులోకి తీసుకొని విచారించగా గతంలోనే హరికిషన్‌పై భద్రాద్రి కొత్తగూడెంలో పలు చీటింగ్ కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు. విచారణ అనంతరం నిందితులను కోర్టులో హాజరు పరిచినట్లు పేర్కొన్నారు.

జీవ వైవిధ్యంలో పులి పాత్ర కీలకం

నవతెలంగాణ-జన్నారం



జీవ వైవిధ్యంలో పులి పాత్ర కీలకమని జన్నారం ఎఫ్ఆర్ఓ సుష్మా రావు, ఇందన్‌పల్లి ఎఫ్ఆర్ఓ ఆఫీసుద్దీన్ అన్నారు. సోమవారం అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా కవ్వాల్ టైగర్ జోన్‌లోని మండల కేంద్రంలో అటవీ అధికారులు బైక్ ర్యాలీ నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ అడవులు విరివిగా పెంచితేనే అందులో పులులుంటాయనితెలిపారు. అడవులలో పులులుంటేనే జీవ వైవిధ్యం సాధ్యమవుతుందన్నారు. పులి తినే జంతువుల కోసం గ్రాస్ ప్లాంట్లను పెంచుతున్నామన్నారు. పులి ఆవాసం కోసం అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామన్నారు. ఈ ఏడాది కూడా 250 హెక్టర్లలో గడ్డిక్షేత్రాలు ఏర్పాటు చేశామన్నారు. అటవీ డివిజన్‌లో రెండేళ్లలో పులికి ఆహారమైన వన్యప్రాణుల సంఖ్య రెట్టింపు అయిందన్నారు. అనంతరం మండల కేంద్రంలోని నర్సరీలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఆర్ఓ ప్రమోద్, తిరుపతి, ఎఫ్ఎస్ఓ కిరణ్ మై, పర్వీనా, ఎఫ్‌బీఓలు సాగర్, రహీముద్దీన్, లాల్‌భాయ్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

వందేండ్ల చరిత్ర సీపీఐది



నవతెలంగాణ-నస్పూర్

వందేండ్ల చరిత్ర సీపీఐ పార్టీదని రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేన శంకర్ అన్నారు. సోమవారం సీపీఐ పట్టణ కార్యదర్శి మిర్యాల రాజేశ్వరరావు అధ్యక్షతన నస్పూర్ పట్టణ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ కౌన్సిల్ సమావేశం నర్సయ్య భవన్‌లో నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి లక్ష్మణ్‌తో కలిసి ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడుతూ దేశవ్యాప్తంగా జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల, గ్రామ శాఖల పునర్నిర్మాణం, పార్టీ బలోపేతానికి ఉపయోగపడే విధంగా కమిటీలను నూతనంగా ఎన్నుకోవడం జరిగిందన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ప్రజా సమస్యలపై పోరాటాలకు, ప్రజల సానుభూతిపరులు, విద్యార్థులు, మేధావుల అందరిని చైతన్యం చేయడానికి 100 సంవత్సరాలు చరిత్ర కలిగిన పార్టీ కమ్యూనిస్టు పార్టీ ప్రజల పక్షాన పోరాడుతుందని తెలిపారు. ఆగస్టు 4న నస్పూర్ మండల నిర్మాణం కౌన్సిల్ సమావేశం నరసయ్య భవన్‌లో, ఆగస్టు 10న జిల్లా నిర్మాణ కౌన్సిల్ మంచిర్యాలలో సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలుపరచాలని లేని పక్షంలో ప్రజా పోరాటాలకు కమ్యూనిస్టు పార్టీ పిలుపునిస్తుందన్నారు. అనంతరం నస్పూర్ పట్టణ కార్యదర్శిగా మిర్యాల రాజేశ్వరరావు, సహాయ కార్యదర్శులుగా తంగళ్ళపల్లి సురేష్, దొడ్డిపట్ల రవీందర్, కోశాధికారిగా గుడెల్లి రాజయ్యను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జోగుల మల్లయ్య, మండల సహాయ కార్యదర్శి లింగం రవి, జిల్లా కార్యవర్గ సభ్యులు కారుకూరి నగేష్, రేగుంట చంద్రశేఖర్, జిల్లా కౌన్సిల్ సభ్యులు ఎస్‌కే బాజీ సైదా, ముస్కె సమ్మయ్య, కొట్టే కిషన్ రావు, కోడి వెంకటేశం, అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

మెరుగుపడని క్రీడా విభాగం

నవతెలంగాణ-నస్పూర్

సింగరేణి సంస్థలోని కార్పొరేట్ క్రీడా విభాగంలో యువకుడైన అధికారిని స్పోర్ట్స్ మేనేజర్‌గా నియమించినప్పటికీ క్రీడా విభాగం మెరుగుపడలేదని, క్రీడాకారులకు కావాల్సిన ప్రోత్సాహకాలు అందడం లేదని సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024- 2025 సంవత్సరానికి క్రీడా వార్షిక షెడ్యూల్ దేశవ్యాప్తంగా ఉన్న పది కోల్ ఇండస్ట్రీస్‌తో పాటు సింగరేణి యాజమాన్యానికి కూడా కోల్ ఇండియా సర్క్యులర్ పంపించిందని, కానీ ఇప్పటి వరకు సింగరేణి అధికారులు స్పందించలేదన్నారు. డబ్ల్యూసీఎల్, ఎంసీఎల్ మొదలగు కోల్ కంపెనీస్ కోల్ ఇండియా సర్క్యులర్ ప్రకారం ఇంటర్ డిపార్ట్‌మెంటల్, నియర్ బై ఏరియా, కంపెనీ లెవెల్ పోటీలను నిర్వహిస్తున్న సింగరేణి సంస్థలో ఇప్పటివరకు స్పోర్ట్స్ బడ్జెట్ కాపీ రిలీజ్ కాలేదన్నారు. కోల్ ఇండియా పోటీలలో మన సింగరేణి యువ క్రీడాకారులు గోల్డ్ మెడల్స్ సాధిస్తూ సింగరేణి స్థాయిని కోలిండియాలో పెంచుతున్న క్రీడాకారులకు మాత్రం తగిన ప్రోత్సాహం అందడం లేదని తెలిపారు.

విద్యార్థులకు న్యాయం చేయాలి



నవతెలంగాణ-కాసిపేట

రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి 30శాతం నిధులు కేటాయించేలా సీపీఐ(ఎం) పార్టీ తరఫున ఒత్తిడి తీసుకొచ్చి విద్యార్థులకు న్యాయం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్ కోరారు. సోమవారం బెల్లంపల్లిలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంకు వినతిపత్రం అందజేశారు. విద్యా రంగంలో అనేక సమస్యలున్నాయని తెలిపారు. స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్‌మెంట్, గురుకులాలకు పక్క భవనాలు, సంక్షేమ హాస్టళ్ల నిర్వహణ, మెస్ కాస్మోటిక్ చార్జీల పెంపు, వివిధ విద్యారంగ సమస్యలు పరిష్కారం కావాలంటే విద్యారంగానికి కనీసం 30శాతం నిధులు కేటాయించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన బడ్జెట్లో విద్యారంగానికి 7శాతం మాత్రమే కేటాయించడం వల్ల ఈ సమస్యలు పరిష్కారం కావని తెలిపారు. బడ్జెట్‌ను 30శాతం పెంచే విదంగా సీపీఐ(ఎం) పార్టీ తరఫున ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రజిత, సాయి కిరణ్, సాయి, తాజ్, సాయికుమార్ పాల్గొన్నారు.

జిల్లాస్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ



నవతెలంగాణ-లక్షెట్టిపేట

జిల్లాలో ఎక్సలెంట్ చెస్ అకాడమీ ఆధ్వర్యంలో నాల్గవ జూనియర్స్ అండర్ 15 చెస్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో లక్షెట్టిపేట పట్టణంలోని సీఎస్ఐ రైడల్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు క్యాతం సమ్మిత్, సీహెచ్ ఆశిష్ ప్రతిభ కనబరిచారు. అండర్ 14 విభాగంలో క్యాతం సమ్మిత్, జిల్లా స్థాయిలో మూడో ర్యాంకు సాధించాడు. సీహెచ్ ఆశిష్ అండర్ 13 విభాగంలో జిల్లా స్థాయిలో మూడో మూడో ర్యాంక్ సాధించాడు. వరుసగా కొనసాగిన ఐదు రౌండ్లలో విజయం సాధిస్తూ ఇద్దరూ మూడవ ర్యాంకులో జిల్లా స్థాయిలో నిలిచారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్, ప్రెస్ బీటర్ ఇన్‌చార్జీ ఎస్. డేవిడ్ పాల్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో వరుసగా మూడో ర్యాంకులో ఇద్దరు విద్యార్థులు చెస్ టోర్నమెంట్‌లో ప్రతిభ కనబరిచిన సందర్భంగా అభినందనలు తెలియజేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని కోరారు. వారం 15 రోజులుగా పీఈటీ ఆశిష్ ఆధ్వర్యంలో మెలుకువలు నేర్చుకుంటూ జిల్లా స్థాయిలో ర్యాంక్ సాధించడం పట్ల పాఠశాల కరస్పాండెంట్, ఉపాధ్యాయులు, పీఈటీ ఆశిష్‌కు అభినందనలు తెలిపారు.

సెల్లార్లు ఖాళీ చేయాలి



నవతెలంగాణ-మంచిర్యాల

ఢిల్లీ ఘటన నేపథ్యంలో మంచిర్యాల, నస్పూర్‌తో పాటు ఇతర పట్టణాల్లో సెల్లార్‌లలో షాపింగ్ మాల్స్, ఇతర వ్యాపారాలు చేస్తున్న వారు సెల్లార్లు ఖాళీ చేయాలని మున్సిపల్ చైర్మెన్ వేణు అన్నారు. సోమవారం నస్పుర్, మంచిర్యాల కౌన్సిలర్‌లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఢిల్లీలోని ఓ కాంప్లెక్స్ సెల్లార్‌లో వరద నీరు చేరి ముగ్గురు మృతి చెందిన ఘటనపై మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్‌రావు తీవ్రంగా స్పందిస్తూ మంచిర్యాలలోనీ సెల్లార్‌లలో నిర్మించిన కట్టడాలను వెంటనే ఖాళీ చేయాలని వ్యాపారస్తులకు సూచించారని కాంగ్రెస్ పార్టీ నాయకులు తెలిపారు. నస్పూర్ మున్సిపల్ చైర్మన్ వేణు, వైస్ చైర్మన్ సల్ల మహేష్, కౌన్సిలర్ వేములపల్లి సంజీవ్ మాట్లాడుతూ మంచిర్యాల, నస్పూర్ మున్సిపల్ పరిధిలో నిర్మించిన వ్యాపార సముదాయాలలోని సెల్లార్‌లో గదులు నిర్మించి అద్దెకు ఇవ్వడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని, వ్యాపారస్తులు అందులో పని చేసే గుమాస్తాలు రోడ్డుపై వాహనాలు నిలపడంతో కొనుగోలుదారుల వాహనాలకు పార్కింగ్‌కు స్థలం లేక రోడ్డుపై పార్కింగ్ చేయడంతో ట్రాఫిక్ సమస్య ఇబ్బందిగా మారిందన్నారు. సెల్లార్‌లు స్వచ్ఛందంగా ఖాళీ చేసి పార్కింగ్‌కు అనువుగా వినియోగంలోకి తీసుకురావాలని సూచించారు. మున్సిపల్ అధికారులు ఇప్పటికే 92 మందికి నోటీసులు జారీ చేశారని వెంటనే అధికారుల ఆదేశాల వ్యాపారస్తులు పాటించాలన్నారు. సమావేశంలో మంచిర్యాల పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, కౌన్సిలర్ భానేశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

పశువులను రోడ్డుపై వదిలితే జరిమానా

నవతెలంగాణ-జన్నారం

ఆవులు, గేదెలను రోడ్డు వదిలితే రూ.1000 జరిమానా విధిస్తామని పొన్కల్ మేజర్ పంచాయతీ ఈఓ రాహుల్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆటోలో మైకు ద్వారా పట్టణంలో చాటింపు వేయించామన్నారు. ఆవులు, గేదెలను రోడ్డుపైకి వదలడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వాటి ద్వారా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. పశువులను రోడ్లపై వదిలితే చర్యలు తప్పవని హెచ్చరించారు. పశువుల యజమానులు గ్రహించాలన్నారు.